ఆడపిల్ల వద్దని..!

తుర్కపల్లి, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఆడపిల్లలను వదిలించుకున్న రెండు వరస ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఓ గ్రామానికి చెందిన నిరుపేద దంపతులకు ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. వారసుడు కావాలనుకున్నారు. వీరికి సెప్టెంబరు 2న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మూడో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టింది. ఆడ పిల్లలను పెంచడం భారమనుకున్నారో ఏమో ఒక జంటకు దత్తత ఇచ్చేశారు. ఈ విషయం తెలియడంతో ఐసీడీఎస్, శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్య శాఖల అధికారులు ఆరా తీశారు. మంగళవారం తండాకు వెళ్లి పసిబిడ్డ తల్లిదండ్రులతో మాట్లాడారు. దత్తత ఇచ్చారా లేక విక్రయించారా అనే కోణంలో విచారించారు. పసిబిడ్డ (ఆడిపిల్ల)ను తీసుకురావాలని ఆదేశించారు. బంధువులు వెళ్లి పసిబిడ్డను తీసుకువచ్చారు. తల్లిదండ్రులను, పసిబిడ్డను అధికారులు భువనగిరి జిల్లా కేంద్రంలోని కౌన్సెలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లారు.

★ మరో గ్రామంలోనూ ఆడపిల్ల దత్తత విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 13న భువనగిరి ఏరియా ఆసుపత్రిలో నిరుపేద తల్లి మూడో కాన్పులో కూడా ఆడపిల్లకు జన్మనిచ్చింది. వారసుడు కావాలన్న తల్లిదండ్రుల కోరిక నెరవేరలేదు. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇప్పుడు మూడో కాన్పులోనూ ఆడబిడ్డ పుట్టినందున సంతానం లేని వారికి అప్పగించారు. దత్తత, విక్రయించారనే ఆరోపణలు రావడంతో సమాచారం తెలుసుకుని అధికారులు ఈ నెల 20న ఆదివారం గ్రామానికి వెళ్లారు. పసిబిడ్డను విక్రయించారనే కోణంలో ఆరా తీశారు. తెలిసిన బంధువులకు పిల్లలు లేని కారణంగా తమ బిడ్డను దత్తత ఇచ్చామని తల్లిదండ్రులు సమాధానం ఇచ్చారు. తల్లిదండ్రులు పసిబిడ్డను తెచ్చి శిశువిహార్ కేంద్రంలో అప్పగించారు.

పెంచితే.. మంచిదే

★ హాస్టళ్ల మెస్, కాస్మెటిక్ ఛార్జీలపై ప్రభుత్వ నిర్ణయమే తరువాయి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

నిరుపేద విద్యార్థులకు పోషకాహారం, ఉచిత విద్యను అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సంక్షేమ హాస్టళ్లకు మెస్ ఛార్జీలు పెంచాలంటూ ఉన్నతాధికారుల కమిటీ ప్రభుత్వానికి నివేదించగా.. 15 ఏళ్ల నుంచి విద్యార్థుల ఎదురు చూపులకు మోక్షం కలుగనుంది. ఈ నెల 21న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా 40 శాతం పెంచాల్సిన అవసరం ఉందంటూ ఉన్నతాధికారుల కమిటీ నివేదించింది. దీంతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎంతో ఆశగా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచితే పోషకాహారం అందించవచ్చని విద్యార్థి సంఘాలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు


★ గురుకుల పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 540 మంది విద్యార్థులు చదువుతుండగా, కళాశాల ఉన్న గురుకులాల్లో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 32 వేల మంది విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపుతో ప్రయోజనం చేకూరనుంది.


ఉమ్మడి జిల్లాలోని హాస్టళ్లు..

జిల్లా	ఎస్టీ	ఎస్సీ	బీసీ	గురుకులాలు	కేజీబీవీ
నల్గొండ	43	60	37	55	27
సూర్యాపేట	20	36	24	42	18
యాదాద్రి	6	21	21	12	9

ఉన్నతాధికారుల కమిటీ డైట్ ఛార్జీ సిఫార్సులు..

తరగతి	ప్రస్తుతం (రూ.లలో)	నివేదించినది (రూ.లలో)
3–7 తరగతులు	950	1,330
8–10 తరగతి వరకు	1,100	1,540
ఇంటర్–పీజీ	1,500	2,100





పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలి..

– కమ్ముంపాటి శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మార్కెట్‌లో వస్తుసామగ్రి ధరలు 15 ఏళ్ల క్రితం కంటే పదిరెట్లు పెరిగాయి. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యార్థులకు రూ.2వేలు, కళాశాల విద్యార్థులకు రూ.3వేలు పెంచాలి, కాస్మెటిక్ ఛార్జీలు విద్యార్థినులకు రూ.500, విద్యార్థులకు కనీసం రూ.300 ఇవ్వాలి.

వార్డు అధికారులొచ్చేశారు

❑ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతానికి నియామకం

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర పురపాలక శాఖ చర్యలు తీసుకుంటోంది. వేలల్లో దరఖాస్తులు రావడం, తక్కువ మంది సిబ్బంది ఉండటంతో పరిష్కారానికి కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించగా.. రాష్ట్ర పురపాలక శాఖ క్షేత్రస్థాయిలో వార్డు అధికారులను నియమించాలని ఆదేశాలు జారీచేసింది. వార్డు అధికారుల నియామకంతో దరఖాస్తుల పరిష్కారం వేగంగా సాగుతోంది.


సూర్యాపేటలో క్షేత్రస్థాయిలో ప్లాటు దరఖాస్తును పరిశీలిస్తున్న వార్డు అధికారులు

19 పురపాలికల్లో 175 మంది

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. 1,93,773 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. 2020లో దరఖాస్తులు చేసుకున్నారు. అవి పురపాలిక పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల లాగిన్‌లో ఉంటాయి. ఎల్ఆర్ఎస్-2020 యాప్ ద్వారా వీరు తొలిదశలో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు దశల్లో అధికారుల పరిశీలన కార్యాలయాల్లోనే సాగుతుంది. వేలల్లో దరఖాస్తులు ఉండటం, పైగా అర్జీ పెట్టుకున్న వారి చిరునామాలు గుర్తించటం, స్థలాల హద్దులు నిర్ధారించడంలో ఇబ్బందులున్నాయి. ఈ క్రమంలో పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కేవలం మూడు బృందాలు పని చేస్తుండటంతో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవటం లేదు. పురపాలక శాఖ వార్డు అధికారులను నియమించాలని సూచించడంతో పుర అధికారులు ఆ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 175 మంది వార్డు అధికారులను నియమించారు. వీరు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలన చేస్తున్నారు.

ఒక్కొక్కరికి 1100 దరఖాస్తులు


పురపాలికలో ఒక్క ఎల్ఆర్ఎస్ దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉంచకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో అధికారికి 1100 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ ప్రక్రియలో పట్టణ పేదరిక నిర్మూలన, మున్సిపల్ వైద్యారోగ్య విభాగాల సిబ్బందిని భాగస్వాములను చేశారు. ఈ మేరకు తనిఖీ బృందాలు పెరగడంతో లక్ష్యం పూర్తయ్యే అవకాశం ఉందని పుర అధికారులు చెబుతున్నారు.

జిల్లా	పురపాలికలు	ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు	వార్డు అధికారులు
సూర్యాపేట	5	65,769	59
నల్గొండ	8	72,642	66
యాదాద్రి	6	55,362	50

విద్యార్థి గుర్తింపు.. అపార్

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, మునగాల, న్యూస్‌టుడే:

ఆధార్‌కార్డు తరహాలో విద్యార్థి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు ఈ కార్డు ఇస్తారు. దీన్నే అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు అంటారు. దేశవ్యాప్తంగా ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కేటాయించే గుర్తింపు కార్డు ఇది. రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో అన్ని పాఠశాలల్లో, ఇతర విద్యా సంస్థలలో ఈ ప్రక్రియ మొదలైంది.



అపార్ నమూనా కార్డు

పొందుపర్చే వివరాలు:

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ప్రయోజనాలు..

అపార్ గుర్తింపు వల్ల డిజీలాకర్‌కు అనుసంధానం అవుతారు. దీంతో అన్ని ధ్రువీకరణ పత్రాలను విద్యార్థి సురక్షితంగా భద్రపర్చుకోవచ్చు. పాఠశాల మారినా ఇబ్బంది ఉండదు. విద్యార్థులు పొందుతున్న ఉపకార వేతనాలు, ఇతర ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయంలో, ఇతర అంశాల్లో అపార్ కార్డు ఆధారంగా సమాచారం తీసుకునేలా రూపొందిస్తారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,631 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా.. అందులో దాదాపు 3.85 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో 220 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో దాదాపు 4 వేల మంది చదువుకుంటున్నారు. వీరు కాక డిగ్రీ, పీజీ కళాశాలల్లో మరో 3 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం అమలవుతున్న దాని ప్రకారం పాఠశాలల్లో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. కేంద్రం ఆపార్ కార్డు ద్వారా కేటాయించే క్యూఆర్ కోడ్ సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో ప్రతి విద్యార్థికి సంబంధించిన కేజీ టు పీజీ పూర్తి వివరాలు, సాధించిన విజయాలు, పొందిన ఉపకార వేతనాలు, మెమోలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఆధార్‌తో అనుసంధానమై ఉండటంతో కుటుంబ వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి.

అనుమతి తప్పనిసరి..

అపార్ గుర్తింపు కార్డు కోసం విద్యార్థి, విద్యార్థి వివరాలు తీసుకుంటున్నందున తప్పనిసరిగా ఆ విద్యార్థి తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అపార్ కార్డు కోసం ఎలా నమోదు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై రాష్ట్ర అధికారులు ప్రధానోపాధ్యాయులకు జూమ్ మీటింగ్ ద్వారా వివరించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో అపార్ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు.

అవగాహన కల్పించి నమోదు చేస్తున్నారు:

అశోక్, జిల్లా విద్యాశాఖాధికారి, సూర్యాపేట

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అపార్ కార్డు కోసం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివరాలు తెలియచేసి వారి అనుమతి తీసుకొని ఆన్‌లైన్ చేయాలని ఆదేశించాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. దీనికి చివరి తేదీ అనేది లేదు.

కన్నీళ్లు పారాయి..!


చౌటుప్పల్ మార్కెట్‌యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యాన్ని కుప్పలుగా పోసిన రైతుల కన్నీళ్లు వరదలా పారుతున్నాయి. ఆర్నెళ్లు శ్రమించి పండించిన పంట అమ్మకముందే మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసి వరదలో కొట్టుకుపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో వరద ప్రవాహానికి ధాన్యం కుప్పల అడుగు భాగం నుంచి కొట్టుకుపోయింది. టార్పాలిన్లు కప్పని ధాన్యం తడిసిపోయింది. చాలా కుప్పల మధ్యకు వర్షపు నీరు చేరింది. తమ కష్టం వరదపాలైందని రైతులు బావురుమన్నారు.

★ చౌటుప్పల్‌తో పాటు చుట్టుపక్కలున్న గ్రామాల్లోని వంద మందికి పైగా రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు ఇక్కడికి తెచ్చి కుప్పలుగా పోశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం శుద్ధి చేసుకుని టార్పాలిన్లు కప్పి పెట్టుకున్నారు. మొదటి కుప్ప పోసి దాదాపు నెల రోజులవుతున్నా ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఇప్పటికి నాలుగైదు పర్యాయాలు వర్షం కురిసి ధాన్యం అడుగు భాగం తడిసి ముద్దయింది. – చౌటుప్పల్, న్యూస్‌టుడే:


వర్షపునీటిలో మునిగిన ధాన్యం కుప్ప వద్ద కన్నీళ్లు పెట్టుకుంటున్న చిన్నకొండూరు రైతులు


చౌటుప్పల్ మార్కెట్‌యార్డులో ధాన్యం కుప్పల మధ్యన చేరిన వర్షపునీరు


ధాన్యం తడవకుండా పాలిథిన్ కవర్లు కప్పేందుకు ప్రయత్నిస్తున్న రైతు కుటుంబ సభ్యులు

ఏఎంసీ వైస్ ఛైర్మన్ నియామకం వివాదాస్పదం

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నియామకంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐనాల చైతన్య ఛైర్‌పర్సన్‌గా, పి.మదార్‌గౌడ్ వైస్ ఛైర్మన్‌గా, మరో 16 మంది డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం గత నెలలో పాలకవర్గాన్ని నియమించింది. వైస్ ఛైర్మన్‌గా నియామకమైన మదార్‌గౌడ్‌కు అర్హతలు లేకపోయినప్పటికీ ఆపదవిలో నియమించారు.

★ ఆలేరు మార్కెట్ పరిధిలో ఆలేరు, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, రాజపేట మండలాల్లోని పూర్తి గ్రామాలు, మోటకొండూరు మండలంలోని కొన్ని గ్రామాలు ఉన్నాయి. పాలకవర్గంలో ఉండాలంటే మార్కెట్ పరిధికి చెందిన స్థానికుడై ఉండాలి. వైస్ ఛైర్మన్‌గా నియామకమైన మదార్‌గౌడ్ మోటకొండూరు మండలం కాటేపల్లికి చెందిన వ్యక్తికాగా.. కాటేపల్లి గ్రామం అధికారికంగా మోత్కూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉంది. కాటేపల్లి గ్రామం చాడ రెవెన్యూ గ్రామ పరిధిలో ఉంటుంది. ఈ రెండు గ్రామాలు కూడా మోత్కూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉండగా.. కాటేపల్లికి చెందిన వ్యక్తిని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఎలా నియమించారన్నది తేలాల్సి ఉంది.

★ మార్కెట్ కార్యదర్శి పద్మజ వివరణ..కాటేపల్లి గ్రామం మోటకొండూరు మండల పరిధిలో ఉన్నందునే ఆ గ్రామానికి చెందిన మదార్‌గౌడ్‌కు సంబంధించి మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. ఇందుకు నిర్ధారణగా మోటకొండూరు మండల తహసీల్దారు ఇచ్చిన ధ్రువపత్రాన్ని ఆధారంగా తీసుకున్నాం. వైస్ ఛైర్మన్ మదార్‌గౌడ్ వివరణ ఇస్తూ ఆలేరు ఏఎంసీ పరిధిలోని మోటకొండూరు మండలానికి చెందిన వ్యక్తిని అయినందునసే వైస్ ఛైర్మన్‌గా నియామకమయ్యానని చెప్పారు.

అక్రమ దత్తత నేరం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమ దత్తత నేరమని జిల్లా బాలల సంరక్షణ సమితి ఛైర్ పర్సన్ బండారు జయశ్రీ, సభ్యులు అన్నారు. తుర్కపల్లి మండలంలో దంపతులు ఆడపిల్ల పుట్టిందనే కారణంతో విక్రయానికి పాల్పడినట్లు చైల్డ్‌లైన్‌కు వచ్చిన సమాచారం మేరకు బాలల పరిరక్షణాధికారి పి.సైదులు, తన సిబ్బంది, పోలీసుల సహకారంతో కలిసి గ్రామంలో విచారణ జరిపారు. దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు, దత్తత తీసుకున్న వారిని బాలల సంరక్షణ సమితి ఎదుట మంగళవారం హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి శిశువును స్థానిక శిశుగృహాలో తాత్కాలిక రక్షణ కింద ఉంచారు. నెల రోజుల కిందట నాలుగు రోజుల ఆడ శిశువును మధ్యవర్తుల ద్వారా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రి నుంచి విక్రయించినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో తుర్కపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. కార్యక్రమంలో సమితి సభ్యులు శివరాజ్, రుద్రమదేవి, మల్లేశం, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి క్షేత్రంలో.. వ్రతం టికెట్ ధర పెంచే యోచన?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి నారసింహుడి క్షేత్రంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతం మొక్కు తీర్చుకునే ఆర్జిత భక్తులపై ఆర్థిక భారం పడనుందా అంటే.. టికెట్ ధర పెంచాలన్న సంబంధిత అధికారుల ప్రతిపాదన నిజమనే చెబుతోంది. ప్రస్తుతం వ్రతం టికెట్ ధర రూ.800 నుంచి రూ.1000కి పెంచాలన్నదే ఆలయ అధికారుల యోచన. ఖరీదు చేసిన టికెట్‌పై పీట ఏర్పాటుతో సహా పూజా సామగ్రిని దేవస్థానం అందజేస్తోంది. దేవస్థానం ఆర్థిక భారం తగ్గించుకునే యత్నంలో భాగంగా పూజ టికెట్ ధరను పెంచే దిశగా ఆలోచిస్తున్న విషయం నిజమేనని ఆలయ ఈవో భాస్కర్‌రావు 'న్యూస్‌టుడే'తో అన్నారు. ధర పెంచే యోచనలో వ్రతం జరిపించుకున్న దంపతులకు శ్రీస్వామి వారి ఉత్తరీయం, కనుమ అందజేయాలని భావిస్తున్నామన్నారు. ఈ ప్రతిపాదనకు దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి వస్తే ధర పెంపునకు అవకాశం ఉంటుందని ఈవో పేర్కొన్నారు.


అభ్యసన సామర్థ్యాలపై దృష్టి పెట్టండి : కలెక్టర్

రాజపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయ వర్గాలు దృష్టి పెట్టాలని జిల్లా పాలనాధికారి హన్మంత్ కె.జెండగే అన్నారు. మండలంలోని పాముకుంట, కాశెగూడెం పాఠశాలలను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, బోధన తీరుతెన్నులపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపడుతున్న పనులను సత్వరమే పూర్తి చేయించాలని సూచించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి పరిజ్ఞానం తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనం నిర్వహణను పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతం ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాశెగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పాలనాధికారి తనిఖీ చేసి చిన్నారులకు, తల్లులకు పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. ఆటపాటల విద్యను అందించాలని పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దారు దామోదర్, ఎంపీడీవో నాగవేణి, ఎంఈవో చందా రమేశ్, ప్రత్యేకాధికారి చంద్రారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాముకుంట పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి హన్మంత్ కె.జెండగే

భూసేకరణ దాదాపు పూర్తి..

◆ చౌటుప్పల్‌లో నేటి నుంచి., భువనగిరిలో ఈ నెల 25 నుంచి అవార్డు విచారణ



భువనగిరి, న్యూస్‌టుడే:

ప్రాంతీయ వలయ రహదారికి భూసేకరణ క్రతువు వడివడిగా సాగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో భూసేకరణ దాదాపు చివరి దశకు చేరుకుంది. ఉత్తర భాగంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో 59.65 కిమీ పొడవున ఈ రహదారి వెళుతుంది.

★ తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో భూసేకరణ బాధ్యతలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు, భువనగిరి మండలం బాధ్యతలు భువనగిరి ఆర్డీవోకు, వలిగొండ, చౌటుప్పల్ మండలాల బాధ్యతలు చౌటుప్పల్ ఆర్డీవోకు అప్పగించారు.

★ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అధీకృత భూసేకరణ అధికారిగా వ్యవహరిస్తున్న యాదగిరిగుట్ట తుర్కపల్లి మండలాల్లో 19.199 కి.మీ.కు సంబంధించి దాదాపు భూసేకరణ పూర్తయ్యింది. అవార్డు విచారణ కూడా పూర్తి చేసి రైతుల వారీగా వివరాలను, బ్యాంకు పాస్‌బుక్కు, పాన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతిని పంపించారు. ధరను నిర్ణయించారు.

★ ముసాయిదా అవార్డు ప్రకారం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు రూ.207 కోట్లు వరకు పరిహారం చెల్లింపు కోసం ఎన్‌హెచ్ఏఐకి ప్రతిపాదనలు పంపారు.

తుది దశలో..

వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో 25.471 కి.మీ.లకు సంబంధించిన భూసేకరణకు చివరి దశలో ఉంది. వలిగొండ మండలంలో ఐదు గ్రామాల్లో భూసేకరణ పూర్తయ్యింది. వలిగొండ మండలంలో ప్రాథమిక అంచనా ప్రకారం రూ.187 కోట్లు భూసేకరణకు రైతులకు పరిహారం చెల్లింపునకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఇక చౌటుప్పల్ మండలంలో చిన్న కొండూరు, నేలపట్ల, తాళ్ల సింగారం గ్రామాల్లో అవార్డు విచారణ దాదాపు పూర్తి చేశారు. చౌటుప్పల్ అర్బన్, లింగోజిగూడెం, తంగెడుపల్లి విచారణ చేపట్టాల్సి ఉంది.

★ 23న తాళ్ల సింగారం, 24న తంగెడుపల్లి, 25న చౌటుప్పల్ అర్బన్‌లో అవార్డు విచారణ జరుగనుంది. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి భూమికి సంబంధించిన పత్రాలు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాల ప్రతులను సేకరించనున్నారు.


ఆరు గ్రామాల్లో..

ఈ నెల 25 నుంచి ఆరు గ్రామాల్లో అవార్డు విచారణకు రైతు సభలకు తేదీలను కూడా ఖరారు చేశారు. భువనగిరి మున్సిపల్ పరిధిలోని రాయగిరిలో నిర్ణయించిన బేసిక్ ధరకు రెండింతలు, మండల ప్రాంతాల్లో మూడింతలు చెల్లిస్తారు. గ్రామ సభల నాటికి భూముల ధరలను నిర్ణయించనున్నారు.

అతిత్వరలో విచారణ పూర్తి చేస్తాం

– శేఖర్‌రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో

చౌటుప్పల్ డివిజన్ త్వరలో అవార్డు విచారణ పూర్తి చేసి జాతీయ రహదారుల విభాగం అధికారులకు ముసాయిదా అవార్డు అందజేస్తారు. వీలైనంత ఎక్కువ పరిహారం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో బేసిక్ ధరకు రెండింతలు చెల్లిస్తాం. చౌటుప్పల్ పట్టణ పరిధిలో ఎకరాకు రూ.36 లక్షలు, మండల పరిధిలో రూ. 35లక్షల వరకు లభించే అవకాశం ఉంది. 60 శాతం మంది అంగీకారం ఇచ్చారు. మిగిలిన వారు కూడా ఇస్తారు.



ఏకరూపం... పంపిణీకి సిద్ధం


పంపిణీకి సిద్ధంగా ఉన్న దుస్తులు

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, చింతలపాలెం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ చిన్నారులకూ రాష్ట్ర ప్రభుత్వం ఏకరూప దుస్తులు ఇచ్చేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వివిధ డిజైన్లను ఎంపిక చేసి మహిళా సంఘాల వారితో కుట్టించే కార్యక్రమం పూర్తి కావొచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులు ఏకరూప దుస్తుల్లో కనిపించేవారు. ఇక నుంచి అంగన్‌వాడీ విద్యార్థులూ ఏకరూప దుస్తులతో అంగన్‌వాడీ కేంద్రాలకు రానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వస్త్రాన్ని ఎంపిక చేసి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు అందజేసింది. వారు మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చి దుస్తులు కుట్టిస్తున్నారు. వీటిని కొద్ది రోజుల్లోనే పిల్లలకు పంపిణీ చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలందరికీ కాకుండా మూడు నుంచి ఆరు సంవత్సరాల వారికి ఏకరూప దుస్తులు ఇవ్వనున్నారు.

ప్రాథమిక విద్యా కేంద్రాలుగా..

అంగన్‌వాడీ కేంద్రాలను పిండి బడులుగా కాకుండా ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్రాల బలోపేతానికి ఇప్పటికే సొంత భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం పౌష్టికాహారం అందిస్తూనే వయసును బట్టి పిల్లలకు విద్యనందిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు. వీరికి త్వరలో ఏకరూప దుస్తులూ అందించనున్నారు. ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. కథల పుస్తకాలు చదివి వినిపించడం, తదితర విద్యా కార్యక్రమాలను కూడా నిరంతరం నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
అంగన్‌వాడీ ప్రాజెక్టులు	09	05	04
కేంద్రాలు	2,093	1,209	901
విద్యార్థుల సంఖ్య	29,283	14,426	18,432

కుట్టు పనులు పూర్తయ్యాయి

– నరసింహారావు, డీడబ్ల్యూవో, సూర్యాపేట

అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడానికి కుట్టు పనులు పూర్తి చేశాం. సిద్ధంగా ఉన్న వస్త్రాలను ఆయా ఆయా కేంద్రాలకు పంపించి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తాం.



నల్గొండ జిల్లాలోని జలాశయాలు పూర్తిగా నిండాయి.పైగా సాగర్ కాలువల ద్వారా జిల్లాలోని గ్రామ చెరువులను నింపారు. దీంతో చెరువులు జలకళతో అందంగా కనిపిస్తున్నాయి. ముషంపల్లి గ్రామ చెరువు కూడా అలా నీటితో నిండింది. పైగా మేఘాలు వచ్చి చెరువులో వాలినట్లు కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. – ఈనాడు, నల్గొండ

ప్రీతమ్..ఆలోచనలు అద్భుతం


తాను గెలుచుకున్న ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో ప్రీతమ్‌కుమార్

నిడమనూరు, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో ప్రపంచం మొత్తం కృత్రిమ మేధ(ఏఐ)పై ఆధారపడుతుంతో పాటు ఏఐని చాలా చోట్ల వినియోగిస్తున్నారు. అందుకు తగ్గట్లు నూతన ఔత్సాహికులకు ప్రభుత్వం అండగా ఉంటే నూతన ఆవిష్కరణలు చేయడానికి వీలవుతుందని అంటున్నాడు నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన పొదిళ్ల ప్రీతమ్‌కుమార్. పాఠశాలల్లో చదువుకునేపుడే రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహించే విజ్ఞాన ప్రదర్శనల్లో పాల్గొని వివిధ అంశాలపై.. నూతన ఆవిష్కరణలను సంపాదించిన అమెరికా, సింగపూర్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు భారత్ తరఫున ఎంపికయ్యాడు.

మూడు సార్లు అంతర్జాతీయ పోటీలకు..

గ్రామానికి చెందిన న్యాయవాది పొదిళ్ల శ్రీనివాస్, అనిత దంపతుల కుమారుడు పొదిళ్ల ప్రీతమ్‌కుమార్ త్రిపురారంలోని ఆల్ఫా పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తిచేశాడు. 2016 ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో రోబోటిక్స్ సంస్థ పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్ ఉపయోగించుకునే అంశంపై విజ్ఞాన ప్రదర్శన నిర్వహించింది. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి పోటీపడిన ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థుల కంటే ప్రీతమ్‌కుమార్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి 'వాటర్‌రోబోట్' అంశంపై జాతీయ స్థాయి మొదటి బహుమతి సాధించాడు. ఆ సంస్థ సింగపూర్‌లో నిర్వహించే పోటీలకు భారత్ తరఫున ఎంపికయ్యాడు. అప్పుడు ప్రీతమ్ మూడో తరగతి చదువుతున్నాడు. ఆర్థిక కారణాలతో ఆ సమయంలో అక్కడికి వెళ్లలేకపోయాడు.

◆ 2017లో ఐఐటీ హైదరాబాద్‌లో నావోటెక్ సంస్థ ఏర్పాటు చేసిన పోటీల్లో స్వచ్ఛభారత్ అంశాన్ని ఎంచుకుని 'చెత్తను శుభ్రపరిచే రోబో'ను తయారుచేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానం సంపాదించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు అమెరికాకు ఎంపికయ్యాడు. 2019లో ఆరో తరగతిలో పుణెలో నిర్వహించిన మరో విజ్ఞాన ప్రదర్శనలో 'అగ్నిప్రమాదలను పసిగట్టే సెన్సార్‌బోట్'ను తయారుచేసి మరోసారి అమెరికాకు వెళ్లేందుకు ఎంపికయ్యాడు. ఈ రెండు సార్లు ఆర్థిక కారణాలతో పోటీలకు హాజరుకాలేకపోయాడు.

◆ ఇప్పటి వరకు పదికి పైగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అన్నింట్లో మొదటి బహుమతులతో పాటు 20 వరకు ప్రశంసాపత్రాలు, 15 వరకు బంగారు, వెండి పతకాలు, జ్ఞాపికలను కైవసం చేసుకున్నాడు.

◆ 'నాకు బలమైన ఆర్థిక వనరులు లేక గతంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోయాను. ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోకరాజురంగరాజు కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను' అని ప్రీతమ్ తెలిపాడు.

అన్నదాత ఆగమాగం

ఈనాడు, నల్గొండ – నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అకస్మాత్తుగా మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. చౌటుప్పల్, చిట్యాల, మిర్యాలగూడ, నకిరేకల్, నిడమనూరు, వేములపల్లి, హాలియాలో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షార్పణమైంది. చౌటుప్పల్, చిట్యాల లాంటి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఇంకా ప్రారంభించలేదు.

❒ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలుండగా.. ప్రస్తుతం 50 శాతం కేంద్రాల్లోనే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడుతుంది.

❒ ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా 7,18,765 ఎకరాల్లో పత్తి సాగవ్వగా 65 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి ఏరే సమయంతో పాటు చేల మీద ఉన్న పత్తి తడవడంతో రంగు మారుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిన్నింగ్ వ్యాపారులు సైతం పత్తి నాణ్యత లేదనే సాకుతో అరకొర ధరకు కొనుగోలు చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌కు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీరు తగ్గడంతో ఎన్నెస్పీ అధికారులు రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 71,361 క్యూసెక్కుల వరదనీరు రాగా సాగర్ డ్యాం నుంచి 2 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 15,948 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటుగా కుడి, ఎడమ కాల్వలు, ప్రధాన విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా మొత్తం 64,518 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 588.80 అడుగులు కాగా ఇది 308.4658 టీఎంసీలకు సమానం.

జలసేద్యం.. ఆరోగ్య భాగ్యం


జలసేద్యం పద్ధతిలో సాగవుతున్న ఆకుకూరలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అతనో సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. డిగ్రీ వరకు చదివినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో తమకున్న భూమిలో పలు రకాల పంటలు సాగిస్తున్నాడు. అందరిలా కాకుండా.. వినూత్నంగా, ఆరోగ్యకరంగా ఆకుకూరలు పండించాలని సంకల్పించి.. ఇది వరకే సాగు చేస్తున్న వారి సలహాలతో జలసేద్యాన్ని ప్రారంభించాడు. ఇటీవలే పంట వినియోగానికి సైతం వచ్చింది. మిర్యాలగూడ పట్టణంలో జల సేద్య విధానంలో పంటలను సాగు చేస్తున్న ఆ రైతు తన అనుభవాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

వాతావరణాన్ని నియంత్రిస్తూ..

జలసేద్యం కోసం మిర్యాలగూడలోని బైపాస్ రహదారి పక్కన పది గుంటల స్థలంలో సుమారు రూ.50లక్షల వ్యయంతో ప్రత్యేకంగా పాలీ హౌస్ ఏర్పాటు చేశాను. వీటి ప్రత్యేకత ఏంటంటే కాలమేదైనా వాతావరణం మారకుండా చూసుకుంటాయి. దీంట్లో భాగంగా తొలుత ఆకుకూరల విత్తనాలను చిన్న చిన్న ట్రేలలో కోకోపిట్(కొబ్బరి పీచు పొడి)లో 15 రోజుల పాటు ఉంచుతాం. అనంతరం ఆ మొక్కలను పైపు ఛాంబర్లలోకి మార్చుతాం. ఇందులో ఎటువంటి మట్టి, కోకోపిట్ ఉండదు. వీటికి పైపుల ద్వారానే కావాల్సిన పోషకాలు అందిస్తాం. మొత్తం మూసి ఉంచడం వల్ల ఎటువంటి పురుగులు, దోమలు లోపలికి రావు.

యూట్యూబ్‌లో చూసి..

నా పేరు పడిగపాటి వెంకట్‌రెడ్డి. మాది దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామం. నాకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. దీంతో కొన్నేళ్లుగా వ్యవసాయంలో వినూత్న పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నాను. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆకుకూరలు అందించాలనే లక్ష్యంతో అన్వేషిస్తుండగా.. యూట్యూబ్‌లో హన్మకొండకు చెందిన రవికిరణ్‌రెడ్డి వీడియోలు చూసి వారి సలహాలతో జలసేద్య పద్ధతిలో ఆకుకూరలు సాగు చేయడం ప్రారంభించాను.

మరీ అవసరమైతే వేప నూనె మాత్రం కొడతాం. నిరంతరం 30డిగ్రీల సెల్సియస్ లోపు ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

వృథా ఉండదు..

సాధారణ పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో అధిక శాతం వృథాగా పోతుంది. జలసేద్య పద్ధతిలో పండించిన ఆకుకూరల్లో ఎటువంటి వృథా ఉండకపోగా.. కాడలు సైతం తినొచ్చు. ఆరోగ్యంతో పాటు రుచిలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం పాలకూర, తోటకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా, చెర్రీ టమాట వంటి పంటలు సాగు చేస్తున్నాం.

త్వరలో ఆన్‌లైన్‌లో అమ్మకాలు...

ప్రస్తుతం మేము ఇటీవలే ప్రారంభించిన హోటల్ విహార్‌లో ఈ ఆకుకూరలు, కూరగాయలు వినియోగిస్తున్నాం. దీంతో పాటు ఇక్కడికి వచ్చిన వినియోగదారులకు సైతం ఆకుకూరలు విక్రయిస్తున్నాం. ప్రతి 25 రోజులకోసారి పంట వస్తుంది. త్వరలోనే ఆన్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభించి.. డోర్ డెలివరీ సైతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

వ్యవసాయ ఇంట.. కొలువుల పంట

మునుగోడు, న్యూస్‌టుడే: నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని.. పక్కా ప్రణాళికతో.. సమయాన్ని వృథా చేయకుండా పట్టుదలతో చదివితే సాధించలేని విజయాలంటూ లేవని నిరూపించారు ఆ యువకుడు. కుమారుడు ఉన్నత స్థానంలో నిలవాలని రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు. నిరుపేద కారణంగా ఆర్థిక సమస్యలు ఎదురైనా.. ఇంట్లో సర్కారు కొలువుల పంట పండించి వెలుగులు నింపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కష్టతరమైన ఈ రోజుల్లో ఏకంగా నాలుగు కొలువులు కొట్టి అందరి ప్రశంసలందుకుంటున్నారు.. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన సురేష్.

రోజూ పది గంటల సాధన


తల్లిదండ్రులు మదనబోయిన వెంకటేశం-సత్తమ్మలతో కుమారుడు సురేష్

మదనబోయిన వెంకటేశం-సత్తమ్మ దంపతుల రెండో కుమారుడు సురేష్.. ఓయూలో 2016లో బీఈ(బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్) పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా హైదరాబాద్‌లో అద్దె ఇంట్లో ఉంటూ నిత్యం పది గంటలపాటు సాధన చేశారు. ఆ పట్టుదలతోనే 2023లో తొలి ప్రయత్నంలోనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ)లో రైల్వే మేనేజర్ ఉద్యోగం సాధించారు. అనంతరం వరసగా 2024 జూన్‌లో నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), ఆగస్టులో టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజినీర్, టీజీపీఎస్సీ గ్రూప్-4కు సైతం ఎంపికయ్యారు. వీటిలో ఏఈఈ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొని సెప్టెంబరు 30న సూర్యాపేట డివిజన్ పరిధిలోని మోతె సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు సైతం స్వీకరించారు. 'అమ్మానాన్నల సహకారంతో కష్టపడి చదువుకున్నా. పట్టుదలతో సాధన చేసి ప్రభుత్వ కొలువులు సాధించా. గ్రూప్-1 సాధించాలనే లక్ష్యంతో ఖాళీ సమయంలో కసరత్తు చేస్తున్నాన'ని సురేష్ పేర్కొన్నారు.

నాసిరకం సింథటిక్ రంగులతో చిరుతిండి తయారీ

◆ తయారీదారుడిపై కేసు నమోదు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: నాసిరకం సింథటిక్ రంగులను వినియోగిస్తూ చెకోడీలు, మిక్చర్, చిరుతిండి పదార్థాలు తయారు చేసి, సరఫరా చేస్తున్న వ్యక్తిని మంగళవారం యాదగిరిగుట్టలో ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేశారు. యాదగిరిగుట్ట ఠాణా సీఐ రమేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన చిన్న ఆనంద్ అనే వ్యక్తి చిరుతిండి పదార్థాలు తయారు చేస్తూ దుకాణాలకు, శుభకార్యాలు, వివిధ ఆర్డర్లపై సరఫరా చేస్తుంటాడు. ఈ పదార్థాలలో నాసిరకం సింథటిక్ రంగులు వాడుతున్నాడనే సమాచారంతో ఎస్వోటీ పోలీసులు మంగళవారం తయారు కేంద్రాన్ని తనిఖీ చేశారు. 500 గ్రాములు కలిగిన వివిధ సింథటిక్ రంగు డబ్బాలు7, 34 చెకోడీ పొట్లాలను, కిలో బరువు కలిగిన 6 మిక్చర్ పొట్లాలు, నలుపురంగులో ఉన్న 5 కిలోల నూనె స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. తయారీదారుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షూటింగ్‌ల అడ్డాగా.. దండుమల్కాపురం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చుట్టూ ఎత్తైన కొండలు..ఆహ్లాదకరమైన ప్రాంతం.. రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటంతో సినిమాల చిత్రీకరణలకు కేరాఫ్‌గా మారింది దండుమల్కాపురం. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఈ గ్రామం శివారులో పలువురు అగ్ర హీరోల సినిమాలను చిత్రీకరించారు. ఎక్కువగా ఇక్కడ అగ్ర హీరోల సినిమాల్లోని క్లైమాక్స్ ఫైటింగ్ సన్నివేశాలనే చిత్రీకరించారు. ప్రస్తుతం హీరో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న సినిమా చిత్రీకరణ కూడా ఇదే గ్రామంలో జరుగుతుంది. నెల రోజుల క్రితమే ఇక్కడ వేసిన రాజస్థాన్ పల్లెటూరు సెట్టింగ్ అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పటికే హీరో బాలకృష్ణ, హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్‌పై పలు కీలక సన్నివేశాలను దర్శకుడు కె.ఎస్. రవీంద్ర(బాబీ) తెరకెక్కించారు. మరికొన్ని రోజుల పాటు ఇక్కడ సినిమా చిత్రీకరణ జరుగనున్నట్టు షూటింగ్ సిబ్బంది పేర్కొన్నారు.



గబ్బర్ సింగ్ సినిమాతో మొదలు..


గబ్బర్‌సింగ్ సినిమాలో స్కార్పియోలతో ఫైటింగ్ సన్నివేశం చిత్రీకరణ

దండుమల్కాపురంలో తొలుత పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్' సినిమా క్లైమాక్స్ ఫైటింగ్‌ను చిత్రీకరించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్కార్పియో వాహనాలతో తీసిన ఛేజింగ్ ఫైటింగ్ సన్నివేశం సినిమాలో హైలెట్‌గా నిలిచింది. ఇదే సినిమాలో ఓ పాటలో సన్నివేశం కూడా ఉంది. దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శకత్వంలో హీరో ప్రభాస్ నటించిన 'రెబల్' సినిమా చిత్రీకరణ కూడా ఇక్కడే జరిగింది. హెలీకాప్టర్‌లో ప్రభాస్ రావడం, హీరో, విలన్ మధ్య ఫైటింగ్ చేసే సన్నివేశాలను ఇక్కడే తీశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో హీరో మహేశ్‌బాబు నటించిన 'ఆగడు' సినిమా కూడా జరిగింది. సుకుమార్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన 'నాన్నకు ప్రేమతో' సినిమా షూటింగ్ కూడా ఇక్కడే తీశారు. సినిమాలో విలన్ జగపతిబాబు వ్యాపారంలో భాగంగా నిర్మించే గ్యాస్ ప్లాంట్ సెట్టింగ్‌ను వేసి.. హీరో, విలన్, హీరోయిన్ రకుల్‌ప్రీత్‌సింగ్‌పై పలు సన్నివేశాలను తీశారు. సినిమాలో వచ్చే ఫైటింగ్‌లలో, పాటలో కూడా పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా షూటింగ్‌లు జరిగిన ప్రాంతాలు ఇప్పుడు పారిశ్రామిక పార్కులో కలిసిపోయాయి. ఇప్పుడు పారిశ్రామిక పార్కు ఎదురుగానే బాలకృష్ణ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. గుణశేఖర్ దర్శకత్వంలో హీరోలు అల్లు అర్జున్, రానా దగ్గుబాటి, హీరోయిన్ అనుష్క నటించిన 'రుద్రమదేవి' సినిమా, సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో హీరో చిరంజీవి నటించిన 151వ సినిమా 'సైరా నరసింహారెడ్డి' సినిమాలు దండుమల్కాపురం రెవెన్యూ పరిధిలోని మైలారం రోడ్డులోని గుట్టల్లోనే చిత్రీకరించారు. ఈ సినిమాల కోసం భారీ సెట్టింగ్‌లను వేశారు.

రాగి తీగ చోరీ చేస్తున్న ముఠాకు రిమాండ్


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కాపర్ తీగను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి

కోదాడ, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ ఎడమ కాల్వ కట్ట మీద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికల్లోని రాగి తీగలను చోరీ చేయడమే లక్ష్యంగా ఐదుగురు వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను ఎట్టకేలకు మునగాల పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

❍ నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచెం కోటేశ్, రూపాని గోపి, రూపాని నాగయ్య, వరికుప్పల శ్రీను, కుంచెం విజయ్‌లు ఐదుగురు ఒక ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా కాపర్ వైర్లను దొంగిలించి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో నాగార్జున సాగర్ ఎడమ కాల్వపైన మునగాల పరిధిలోని ఆర్-9 లిఫ్ట్, కలకోవ రైతు రక్షణ కమిటీ ఎత్తిపోతల పథకం లిఫ్టలకు సంబంధించిన విద్యుత్తు నియంత్రికలోని కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. లిఫ్టు నిర్వాహకులు మునగాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

❍ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మొద్దులచెరువు సమీపంలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాల మీద ఐదుగురు నిందితులు వెళ్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ కేసుతో పాటు నడిగూడెం, పెన్‌పహాడ్ పోలీసు స్టేషన్ల పరిధితో పాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో కాపర్ తీగను దొంగలించినట్లు ఒప్పుకొన్నారు. నిందితుల దగ్గరి నుంచి సుమారు రూ.3.60 లక్షలు విలువ చేసే 2.20 క్వింటాళ్ల కాపర్ తీగను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకొని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై గతంలో ఒక్కొక్కరిపై సుమారు ఐదు కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో పురోగతి సాధించిన సిబ్బందిని ఆయన అభినందించి రివార్డు అందించారు. కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీనివాస్‌రెడ్డి

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముషంపల్లి గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాస్ రెడ్డి(40) తన వ్యవసాయ భూమిలో మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. రూరల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు.. శ్రీనివాస్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో సాగుకు సంబంధించిన పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ వైరు కాలుకి తగిలి కింద పడిపోయారు. గమనించిన స్థానికులు నల్గొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

భూమి మార్పిడి కేసులో ఆపరేటర్‌కు బెయిల్

★ తహసీల్దార్ జయశ్రీకి దక్కని ఊరట

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమి అక్రమంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి, రైతుబంధు నిధుల దుర్వినియోగం కేసులో ఏ-2 ముద్దాయిగా అరెస్టయిన ధరణి ఆపరేటర్ జగదీశ్‌కు హుజూర్‌నగర్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తు, ఇద్దరు వ్యక్తుల జామీను, ప్రతి శనివారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు హాజరై సంతకం చేయాలన్న నిబంధనలతో బెయిల్ మంజూరైంది. బెయిల్ మంజూరు కావడంతో జగదీశ్‌ను సబ్ జైలు నుంచి విడుదల చేశారు. ఏ-1 ముద్దాయిగా ఉన్న గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీకి బెయిల్ మంజూరు కాకపోవడంతో ఆమె హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. విచారణ ఈనెల 25కు వాయిదా పడింది.

హత్య కేసులో జీవితఖైదు, జరిమానా

హాలియా, న్యూస్‌టుడే: ఒకరిని హత్యచేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావటంతో అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల చినవెంకటరెడ్డికి జీవితఖైదు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ మంగళవారం మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.వేణు తీర్పు ఇచ్చారు. హాలియా ఎస్సై సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 2018 జూన్ 12న అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల పెద్ద వెంకటరెడ్డి తన పొలంలో చనిపోయి ఉన్నాడని అతడి భార్య అలుగుల కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పుడు విధుల్లో ఉన్న హాలియా ఎస్సై బీ.సతీష్ కేసు నమోదు చేయగా.. నాటి సీఐ కే.ధనుంజయ్ కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడు హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో శిక్షను విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలోని సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ ప్రతిపాదిత స్థలంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. వివిధ శాఖల అధికారులు ఈకార్యక్రమంలో హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అఖిలపక్ష నాయకులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

పీఆర్‌టీయూ అభ్యర్థిని గెలిపించాలి

మోటకొండూరు, న్యూస్‌టుడే: జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, జి.మధుసూదన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదు దరఖాస్తులను ఉపాధ్యాయులకు మంగళవారం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరారెడ్డి, మండల అధ్యక్షుడు ఉమాశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీపతి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



భువనగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షురాలు రేపాక ఉమ అన్నారు. ప్రభుత్వ గంజ్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం తపస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ డీఏలు, పీఆర్‌సీతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొనడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 28న తహసీల్దార్లకు వినతి పత్రాల సమర్పణ, నవంబరు 5వ తేదీన కలెక్టరేట్ల ఎదుట ధర్నా, 23న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమిరెల్లి భాస్కర్‌రెడ్డి, పలుగుల సంతోష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఐకాస్ క్యాంపెయిన్‌లో భాగంగా వైటల్ కేర్ లింక్ వర్కర్స్ స్కీం వారి సహకారంతో కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఎయిడ్స్, టీబీ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సుఖ వ్యాధులపై అవగాహన, వ్యాధులు వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ పద్ధతుల గురించి వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాతేశ్వరి, గ్రంథపాలకులు మంగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు

వలిగొండ, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడి.. తక్కువ కాలం.. తక్కువ నీటితో సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అన్నదాతలకు ఆదాయం పెరుగుతుంది. వినాయక చవితి, బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలు వరసగా వస్తాయి. ఈ సమయంలో పూలకు గిరాకీ పెరిగి బంతి సాగు చేసే రైతులకు లాభాలు తెచ్చి పెడతాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని కొంత మంది రైతులు బంతి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రానికి చెందిన గూడూరు జంగారెడ్డి ఎకరం ముప్పావు గుంటల్లో బంతి పూల సాగు చేపట్టారు. పండుగల వేళ దిగుబడి వచ్చేలా ప్రణాళికతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మేలు రకమైన ఎనిమిది వేల పచ్చ, ఎర్ర బంతి మొక్కలు తెచ్చి నాటారు. రూ.80 వేల పెట్టుబడి పెట్టారు. వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండగలకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. నాటిన రెండు నెలల వ్యవధిలోనే తాను పెట్టిన పెట్టుబడి వచ్చిందని రైతు పేర్కొన్నారు. ముప్పావు గుంటలకు సుమారు ఐదు నుంచి ఆరు టన్నుల వరకు బంతి పూల దిగుబడి వస్తోంది. దీపావళి పండగకు పూల ధరలు పెరిగి సుమారు రూ.లక్ష వరకు ఆదాయం రానుందని రైతు చెప్పారు. దీనికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై డ్రిప్, మల్చింగ్ పేపర్ ఇచ్చి ప్రోత్సహిస్తే తన ఎకరంతో పాటు, మరికొంత కౌలుకు తీసుకొని బంతి పూలతో పాటు, ఇతర పంటలు పండించి గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తానని జంగారెడ్డి చెబుతున్నారు.



వలిగొండలో జంగారెడ్డి సాగు చేసిన బంతి తోట

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80082 78928 80085 74375

గుండాల, న్యూస్‌టుడే:

? గుండాల బీసీకాలనీలోని ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

✔ ఖాళీ స్థలాల్లో నిల్వ నీటిని పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగిస్తాం. ఆయిల్‌బాల్స్ ద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.
– బి.విజయ, పంచాయతీ కార్యదర్శి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

? హైదరాబాదు నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో దర్గా సమీపంలో చెట్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. కూలిన పక్షంలో ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. చెట్టును తొలగించాలి. – జ్ఞానప్రకాశ్ రెడ్డి, భువనగిరి

✔ చెట్టును తొలగిస్తాం.
– పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పుర అధ్యక్షుడు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే:

? యాదగిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జులాయిలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోలింగ్ చేపట్టి జులాయిలపై చర్యలు తీసుకోవాలి.
– శ్రీను, యాదగిరిగుట్ట.

✔ పెట్రోలింగ్ చేపట్టి జులాయిలపై చర్యలు తీసుకుంటాం.
– అనిల్‌కుమార్, ఎస్సై, యాదగిరిగుట్ట ఠాణా.

కొత్త మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయాలి

మోటకొండూరు, న్యూస్‌టుడే: జీవో నెంబర్ 43 ప్రకారం ఆత్మకూరు(ఎం), మోటకొండూరు మండలాలను కలిపి కొత్త మార్కెట్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భారాస మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పక్షపాత ధోరణితోనే మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. ఆలేరు మార్కెట్ కమిటీకి మోటకొండూరు మండలం నుంచి ఎంపిక చేసిన డైరెక్టర్ల నియామకం రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎండీ బురాన్, బొట్ల నర్సింహా, మధు, ప్రశాంత్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులు ఈ నెల 25లోపు పూర్తిచేయాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదితో పాటు మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ధర్నా



మోత్కూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల ఈ ప్రాంత పేదలు, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోత్కూరులో బస్‌డిపో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

కుమురంభీం జయంతి.. కుమురంభీం జయంతిని పురస్కరించుకుని ఆయన బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో సమితి ప్రతినిధులు కె.నర్సయ్య, నాగప్ప, సురేష్‌గౌడ్, రాములు, మహబూబ్ అలీ, కొమరయ్య, సోమయ్య పాల్గొన్నారు.

కూలిన పాఠశాల భవనం.. విద్యార్థులకు తప్పిన ప్రమాదం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బొల్లేపల్లిలో 60 సంవత్సరాల క్రితం నిర్మించిన జడ్పీ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ముందు భాగం వరండా కూలిపోయింది. ఈ ఘటన ఆదివారం జరగడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పినట్లైంది. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరలో నూతన భవన నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా విద్యా శాఖాధికారితో పాటు సంబంధిత మండలాధికారులకు లిఖితపూర్వకంగా సమాచారం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కూలిన పాఠశాల భవనం

గ్రామంలో మద్యపానం నిషేధిస్తూ తీర్మానం

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: బొమ్మలరామారం మండలంలోని పిల్లిగుండతండా గ్రామంలో మద్యపానం నిషేధిస్తూ తీర్మానం చేశారు. గ్రామంలో కొన్ని రోజులుగా నాలుగు బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు మద్యం మత్తులో గొడవలు పడుతున్నారు. చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారు. గమనించిన గ్రామంలోని యువకులు, మహిళలు గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని నిర్ణయించుకొని సమావేశమయ్యారు. మద్యం అమ్మకాలు నిలిపివేయాలని, అమ్మకాలు జరిపినట్లయితే రూ.25 వేల జరిమానా చెల్లించాలని తీర్మానించుకున్నారు. గ్రామప్రత్యేకాధికారి, ఎంపీవో మాలతి సమక్షంలో తీర్మానం ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ధీరావతు మోతి, మాజీ ఉప సర్పంచి ధీరావతు బాల్‌సింగ్, శ్రీనివాస్, దేవేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న గ్రామస్థులు

మూసీ ప్రక్షాళనతో ప్రజలకు మేలు: ఎమ్మెల్యే సామేల్



మేడిపల్లిలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, న్యూస్‌టుడే: మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణను ప్రజలు కోరుకుంటున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. హైదరాబాద్ మేడిపల్లిలోని ఓ గ్రాండ్‌హోటల్‌లో మంగళవారం తుంగతుర్తి నియోజకవర్గంలోని మూసీ పరివాహక ప్రాంత మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం, తిరుమలగిరి, నాగారం మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో ‘మూసీ పునరుజ్జీవన కోసం సన్నాహక సమావేశం’ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో రాష్ట్ర ప్రభుత్వం మూసీప్రక్షాళన దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ నదిని ప్రక్షాళన చేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందని, దీనిపై ప్రజలను కాంగ్రెస్ నాయకులు చైతన్య పర్చాలని కోరారు. పలు మండలాల్లో బీడువారిన నేలలకు నీటి సౌకర్యం కల్పించడం, తగినన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సమావేశంలో మోత్కూరు, తిరుమలగిరి పుర అధ్యక్షులు గుర్రం కవిత, శాగంటి అనసూయ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, లింగయ్య, టి.లింగయ్య, కందాల సమరంరెడ్డి, సింగిల్‌విండోల ఛైర్మన్లు పి.వెంకటేశ్వర్లు, నిరంజన్ రెడ్డి, తిరుమలగిరి మార్కెట్ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై వానరాల దాడి

మోటకొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆరెగూడెంలో ఇద్దరు మహిళలపై వానరాలు దాడి చేశాయి. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితులను మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఇప్పటి వరకు గ్రామంలో 20మందిపై కోతులు దాడి చేశాయని గ్రామస్థులు వెల్లడించారు.

గొర్రెల కాపరి అదృశ్యం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెలను మెపుకుంటు చౌటుప్పల్‌కు వచ్చిన యువకుడు మంగళవారం ఉదయం అదృశ్యమైనట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన బండారి శ్రీకాంత్(18)తో పాటు మరో పది మంది కాపరులు గొర్రెలను మెపుతూ మండలంలోని ధర్మోజిగూడెం శివారులోకి చేరుకున్నారు. సోమవారం రాత్రి అక్కడే గొర్రెల మందతో ఉన్నారు. మంగళవారం ఉదయం శ్రీకాంత్ కాలకృత్యాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికిన అతడి ఆచూకీ లభించకపోవడంతో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్ తండ్రి ఆశప్ప ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

గంజాయి దహనం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసిన గంజాయిని భువనగిరి శివారులోని రోమా ఇండస్ట్రీస్‌లో దహనం చేశారు. నల్గొండ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 25 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ అనుమతితో దహనం ప్రక్రియ చేపట్టినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయి 144 కిలోలు, గంజాయి చాక్లెట్లు 4.5 కిలోలు హాష్ ఆయిల్ 40 ఎం.ఎల్ కాల్చివేశామని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల ఎక్సైజ్ అధికారులు బి.సంతోష్, ఎస్.సైదులు, ఆర్. లక్ష్మానాయక్, నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సతీమణి దాతృత్వం

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోటమర్తిలో నిరుపేద కుటుంబానికి చెందిన వంగూరి ఎల్లమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. పార్టీ కార్యకర్తల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్ సతీమణి యాదమ్మ (మేరి) ఎల్లమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 50 వేలను అంత్యక్రియల నిమిత్తం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు చిత్తలూరి సోమయ్య, మాజీ సర్పంచులు చిప్పలపెల్లి బాలు, విక్రంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు యాదమ్మ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి

భువనగిరి, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. విద్యార్థులు భారీగా తరలివచ్చారు. సుమారు గంటసేపు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. బోధన రుసుములు చెల్లించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో వట్టెం మధు, కరుణాకర్‌రెడ్డి, చందు, బాలాజీ, గుణవర్ధన్, విజ్ఞాన్, జస్వంత్, ఉపేందర్, మానస, శంకర్, నవీన్, శిరీష, రమాదేవి పాల్గొన్నారు.



బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థులు

సభ్యత్వ నమోదు వేగిరం చేయండి



భాజపా సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి

భువనగిరి, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని భాజపా రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి కోరారు. జిల్లా సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన స్థానిక ఎంఎన్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన సభ్యత్వ లక్ష్యాలను ఈ నెల 27లోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, దాసరి మల్లేశం, పడాల శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ ప్రముఖ రాచకొండ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్‌గుప్తా, ఉట్కూరు అశోక్‌గౌడ్, శివకుమార్, అశోక్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, రత్నపురం బలరాం, యాదిరెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమకు అనుమతులివ్వొద్దు



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రామన్నపేట వాసులు, భారాస నాయకులు

భువనగిరి, న్యూస్‌టుడే: రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వొద్దని రామన్నపేట వాసులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల కాలుష్య సమస్య తలెత్తి ప్రజారోగ్యాలు దెబ్బతినడంతో పాటు పొలాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తామని మండల పరిధిలోని కొమ్మాయిగూడెంలో సుమారు 50 ఎకరాలను కొనుగోలు చేసి సిమెంట్ ఫ్యాక్టరీకి ఏర్పాటుకు ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా కొమ్మాయిగూడెం, రామన్నపేట, సిరిపురం, బోగారం, నిర్నిముల, జనంపల్లి, వెల్లంకి, దుబ్బాక, తుమ్మలగూడెం, పెద్దకాపర్తి గ్రామాల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆంజనేయులు, భారాసపట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోపాల్, పెంట నరసింహ, నగేష్ పాల్గొన్నారు.

రామన్నపేట : రామన్నపేటలో సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయెుద్దని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన అఖిల పక్షం సమావేశంలో మాట్లాడారు. రాజకీయాలకతీతంగా పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించాలన్నారు. జల్లెల పెంటయ్య, ఎం.డి.రెహాన్, నర్సింహ, దుర్గయ్య, వెంకటేశం, పృథ్వీరాజ్, మీర్జా ఫజల్‌బేగ్, ఎం.డి.జమీరొద్దీన్ నరేందర్, గూని రాజు తదితరులు పాల్గొన్నారు.

☛ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రామన్నపేటలోని పరిశ్రమ ఏర్పాటు స్థలం వద్ద కార్మికులు ఉరివేసుకొని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరవు

భువనగిరి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కరవైందని భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురిచంద్ర విమర్శించారు. పట్టణంలోని బాలసదన్‌లో పదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వెంకట్‌రెడ్డి అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగురాని శ్రావణి, పట్టణ అధ్యక్షురాలు మల్లిక, జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవి, కార్యదర్శి లక్ష్మీ, లాస్య, మండల అధ్యక్షురాలు మౌనిక, పట్నం కపిల్, నరేష్, నరసింహ, కృష్ణాచారి పాల్గొన్నారు.



భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న భాజపా మహిళా మోర్చా నాయకులు

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రెండు పంటలకు రైతు భరోసా నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్ చేశారు. భువనగిరిలోని సుందరయ్య భవనంలో మంగళవారం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న వడపర్తిలో నిర్వహించనున్న మండల 8వ మహాసభలు జయప్రదం చేయాలన్నారు. మండల కమిటీ సభ్యుడు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ్మా, నాయకులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

భాజపా సభ్యత్వ నమోదు.. భువనగిరి : భువనగిరి 24వ వార్డులో కౌన్సిలర్ రత్నపురం బలరాం ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కేంద్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి చాడ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దాసరి మల్లేశం, రవీందర్, నర్ల నర్సింగరావు, అశోక్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన.. ఆత్మకూరు(ఎం): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్సులో వరి, పత్తి పంటలకు వచ్చే తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఏవో గోపాల్, ఎంఎవో బి.అరుణకుమారి, ఏఈవోలు పాల్గొన్నారు.

సిమెంటు పరిశ్రమ వద్దని లేఖ.. భువనగిరి నేరవిభాగం: రామన్నపేటలో జనావాసాల మధ్య సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయెుద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో విద్యావంతులు, మేధావులు పాల్గొని వ్యతిరేకించాలని కోరారు.

సామాజిక తనిఖీ.. అడ్డగూడూరు: అడ్డగూడూరు గ్రామపంచాయతీ పరిధిలో 2023-24 సంవత్సరానికి చెందిన ఆదాయ, వ్యయాల లావాదేవీలపై జిల్లా అసిస్టెంట్ ఆడిటర్ సురేందర్‌రెడ్డి మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దస్త్రాలు, బిల్లులను తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, నరేష్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం.. రాజపేట: జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా రాజపేటకు చెందిన బెజగం సంతోష్‌కుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా.. ఆలేరు: తెలంగాణ ఆర్యవైశ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఆలేరుకు చెందిన సముద్రాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మలగారి శ్రీనివాస్ నుంచి మంగళవారం నియామక పత్రం అందుకున్నారు.

రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం నేడు.. భువనగిరి: రెడ్‌క్రాస్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కమిటీ ఛైర్మన్ గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి కోరారు. పట్టణంలోని వివేరా హోటల్‌లో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బుధవారం జరిగే రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, విశిష్ట అతిథులుగా రెడ్‌క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు హాజరవుతారని తెలిపారు.

రోడ్డు నిర్మాణం ప్రారంభం.. చౌటుప్పల్: చౌటుప్పల్ 14వ వార్డు పరిధిలోని కంఠమహేశ్వరస్వామి దేవాలయం చుట్టూ సిమెంటు రోడ్డు నిర్మాణ పనిని పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు మంగళవారం ప్రారంభించారు. గణేశ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఉప ఛైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు సందగళ్ల విజయ, కొయ్యడ సైదులుగౌడ్, బాబాషరీఫ్, దేవాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి.. బొమ్మలరామారం: ఉపాధ్యాయుల, ఉద్యోగులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీఎస్ టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. మండల కేంద్రలో జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తూ.. డీఏ, ఆర్థిక పరమైన బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యాదయ్య, మహేష్, సుదర్శన్‌రెడ్డి, భిక్షమయ్య పాల్గొన్నారు.

స్వామి సేవలో ఎమ్మెల్సీ మల్లేశం.. యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం తన సహచరులతో మంగళవారం సందర్శించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవారాధనల్లో పాల్గొన్న ఎమ్మెల్సీకి ఆలయ ఆచారంగా శ్రీస్వామి, అమ్మవార్ల ఆశీస్సులు అందజేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రద్దు చేయెుద్దు.. మోత్కూరు: ఎంతో సౌకర్యంగా ఉండి, సొంత భవనం కలిగి ఉన్న స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ పేరుతో రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 1989లో ప్రారంభమైన ఈ కార్యాలయానికి రూ.70 లక్షలతో సొంత భవనం నిర్మించారని చెప్పారు.

ఆవిర్భావ దినోత్సవం జయప్రదానికి పిలుపు.. యాదగిరిగుట్ట పట్టణం: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 31న జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరిగుట్టలో జరిగిన ఆ సంఘం నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి.. మోత్కూరు: తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సాహితీ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ కోరారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో, డిగ్రీ కళాశాలల్లో ప్రచార పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమాల్లో ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, ప్రజాభారతి అధ్యక్షుడు డి.అరవిందరాయుడు, మాజీ కార్యదర్శి జయశ్రీ, తెలంగాణ సాహితీ జిల్లా కోశాధికారి టి.ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు డి.గోపికృష్ణ, వెంకటాచారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం.. భువనగిరి నేరవిభాగం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి అన్నారు. భువనగిరిలోని సుందరయ్యభవనంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం ఈశ్వర్, నాయకులు యాదగిరి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో యువకుడి మృతి

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు రైల్వే స్టేషన్‌లో ఓహెచ్‌ఈ షెడ్ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి(30) మృతి చెందాడు. ఓహెచ్‌ఈ(రైల్వే విద్యుత్తు లైన్ మరమ్మతులకు సంబంధించిన) ఇంజిన్ షెడ్‌లోకి వెళ్తున్న క్రమంలో ఒక యువకుడు అకస్మాత్తుగా ఇంజిన్‌కు అడ్డంగా పట్టాలపైకి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.